సాక్షి మంచిర్యాల

ఆదివారం : 3 : నవంబర్ : 2024



ప్రోత్సహిస్తే సత్తా చాటుతాం

ప్రోత్సహిస్తే క్రీడా పోటీల్లో సత్తా చాటుతామని ఉమ్మడి జిల్లా ఖోఖో క్రీడాకారులు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లే వారికి రవాణా చార్జీలు, క్రీడాదుస్తులు అందించాలని కోరారు. 8లో▸

8న యువజనోత్సవాలు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 8న యువజనోత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి కీర్తి రాజ్‌వీర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని 15 నుంచి 35 ఏళ్లలోపు బాలబాలికలు, యువతీ, యువకులు, కళాకారులు వివిధ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0 /21.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. చలిగాలులు వీస్తాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.

న్యూస్‌రీల్

గూడెంలో కార్తీక సందడి



ఆకాశదీపం ప్రారంభిస్తున్న అర్చకుడు

దండేపల్లి/మంచిర్యాలఅర్బన్: దండేపల్లి మండలం గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో కార్తీక సందడి మొదలైంది. శనివారం ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సత్యదేవుణ్ని దర్శించుకోవడంతోపాటు పలువురు భక్తులు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోముకున్నారు. మంచిర్యాల విశ్వనాథ ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా శనివారం ఆకాశ దీపం ప్రారంభించారు. అనంతరం గణపతి పూజా కార్యక్రమం నిర్వహించారు. భక్తులు ఆకాశదీపంలో నూనె పోసేందుకు బారులు తీరారు. నెల రోజులపాటు భక్తులు తీసుకువచ్చిన నూనెతో రోజు ఆకాశదీపం వెలిగిస్తారు. ఈ కార్యక్రమంలో ఈవో ముక్తారవి, అర్చకులు నరహరిశర్మ, భట్టాచార్య, బాలక్రిష్ణ, శ్రీకేష్ తదితరులు పాల్గొన్నారు.

కవ్వాల్‌లో ప్రభుత్వ అదనపు కార్యదర్శి పర్యటన



సఫారీలో ప్రభుత్వ కార్యదర్శి

జన్నారం: కవ్వాల్ టైగర్‌జోన్ జన్నారం అటవీ డివిజన్‌లో ప్రభుత్వ అదనపు కార్యదర్శి అశోక్ కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి శనివారం పర్యటించారు. ఉదయం జన్నారానికి వచ్చిన ఆయన ఉదయం గేట్ నంబర్ 1 నుంచి సఫారీలో అడవిలో పర్యటించారు. అడవిలో పచ్చదనం, వన్యప్రాణులను చూసి మురిసిపోయారు. అడవిలో అటవీశాఖ ఏర్పాటు చేసిన కుంటలు, గడ్డి మైదానాలు పరిశీలించారు. ఇక్కడ జరుగుతున్న అభివృద్ధిపై అటవీ రేంజ్ అధికారి సుష్మారావును అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి, రక్షణ, గడ్డి పెంపకాలు తదితర వాటిని ఆయనకు వివరించారు.


తప్పులు లేకుండా సర్వే నిర్వహించాలి



సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

జైపూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే తప్పులు లేకుండా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ తెలిపారు. మండల కేంద్రంలో చేపడుతున్న సర్వేను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్వే తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎన్యుమరేట్ బ్లాక్(ఈబీ) వారీగా ప్రతీ ఇంటికి స్టిక్కర్లు అతికించాలని తెలిపారు. అనంతరం జెడ్పీ సీఈవో గణపతి సర్వేను పరిశీలించారు. ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో శ్రీపతిబాపురావు, పంచాయతీ కార్యదర్శి ఉదయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



మెనూ ప్రకారం అరటిపండు, కోడిగుడ్డు

మంచిర్యాలఅర్బన్: ఎస్సీ వసతిగృహాల్లో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ జిల్లా అధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి డీడీ కార్యాలయంలో డైట్, కాస్మెటిక్ చార్జీల పెంపు నేపథ్యంలో కొత్త మెనూ అమలుపై సంక్షేమాధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూలో మార్పులు చేశారని, వారానికి ఆరు రోజులు కోడిగుడ్లు, అరటిపండ్లు, స్నాక్స్ విద్యార్థులకు అందించాలని సూచించారు. పోస్టుమెట్రిక్ హాస్టళ్లలో ఐదు రోజులు కోడిగుడ్డు, రెండ్రోజులు చికెన్, ఆరు రోజులు అరటిపండ్లు ఇవ్వాలని తెలిపారు. సమావేశంలో జిల్లాలోని వసతిగృహ సంక్షేమాధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ బాలుర హాస్టల్‌లో..

జిల్లా కేంద్రంలోని ఎస్సీ కళాశాల బాలుర హాస్టల్‌లో శనివారం రాత్రి విద్యార్థులకు మారిన మెనూ ప్రకారం భోజనం వడ్డించారు. కోడిగుడ్డు, అరటిపండ్లు అందించడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. డైట్ చార్జీల పెంపుతో అందించే భోజనంపై వసతిగృహ సంక్షేమాధికారి కుమరస్వామి విద్యార్థులకు వివరించారు.

రబీ ప్రణాళిక సిద్ధం



- 1.24లక్షల ఎకరాల్లో సాగు అంచనా
- వరి సాగే అధికం

మంచిర్యాలఅగ్రికల్చర్: ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు గత నెలాఖరు నుంచి దిగుబడి వస్తున్నాయి. రబీ సీజన్ సాగు మరో పక్షం రోజుల్లో ప్రారంభం కానుంది. దీంతో వ్యవసాయ శాఖ అధికారులు సాగు అంచనాకు అనుగుణంగా విత్తనాలు, ఎరువుల ప్రణాళిక రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. యాసంగిలో 1.12లక్షల ఎకరాల్లో పంటలు సాగు కాగా, ఈ ఏడాది 1,24,292 ఎకరాల్లో పంటల సాగు విస్తీర్ణం ఉంటుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో వరి సాగు అధికంగా ఉండనున్నట్లు పేర్కొన్నారు. 32,300 క్వింటాళ్ల వరి విత్తనాలు, 3 క్వింటాళ్ల శనగ, 5 క్వింటాళ్ల మొక్కజొన్న, 4 క్వింటాళ్ల మినుము, 2 క్వింటాళ్ల పెసలు, 16 క్వింటాళ్ల ఇతర విత్తనాలు అవసరమని అంచనా వేశారు. సాగుకు అవసరమయ్యే ఎరువులకు కూడా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ రబీకి 8 వేల మెట్రిక్ టన్నుల యూరియా, 2,800 మెట్రిక్ టన్నుల డీఏపీ, 1,500 మెట్రిక్ టన్నుల పొటాష్, 2,700 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు అవసరమని ప్రభుత్వానికి నివేదికలు పంపించారు.

ఖరీఫ్ వరి నాట్లు ఆలస్యం

ఈ ఏడాది ఖరీఫ్ ఆరంభంలో జూన్‌లో వర్షాలు లేక వరి నారు పోసుకోలేదు. జూలై నెలాఖరులో కురిసిన ఎడతెరిపి లేని భారీ వర్షాలతో వరి నాట్లు వేసుకున్నారు. ఆగస్టు రెండో వారంలో కురిసిన భారీ వర్షాలతో ఆలస్యంగా వరి నాట్లు పడ్డాయి. జలాశయాలు నిండుకుండలా మారాయి. దీంతో పంట దిగుబడి 25నుంచి 35 రోజుల వ్యవధిలో ఆలస్యంగా వచ్చే అవకాశం ఉంది. ఇప్పుడిప్పుడే పత్తి తీత, వరికోతలు ప్రారంభమయ్యాయి. వాస్తవంగా సరైన సమయంలో వర్షాలు కురిసి నాట్లు వేసుకుంటే వరి పంట అక్టోబర్ మొదటి వారం నుంచి దిగుబడి రావాల్సి ఉంది. కానీ ఈ ఏడాది వరి నాట్లు ఆలస్యం కావడంతో ఈ నెలలో పంట దిగుబడి రానుంది. దీంతో రబీ సాగు కొంత ఆలస్యమయ్యే అవకాశం ఉంది. ఈ ఏడాది భారీ వర్షాలు కురువడంతో బోరుబావుల్లో నీరు పైకొచ్చింది. ప్రాజెక్టుల్లోకి పూర్తిస్థాయిలో చేరింది. భూగర్భ జలమట్టం పెరిగింది. సన్నరకం వరి ధాన్యానికి ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో వరి సాగు అంచనాలకు మించి సాగయ్యే అవకాశం ఉంది.

వరి సాగే అధికం

గతేడాది యాసంగిలో 1,02,100 సాగు విస్తీర్ణం ఉండగా ఈ ఏడాది 1.06 లక్షల ఎకరాల్లో సాగు ఉంటుందని అంచనా వేశారు. జిల్లాలో రైతులు వరిసాగుకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. వరి తర్వాతి స్థానం మొక్కజొన్న, జొన్న, శనగ సాగు ఉంటుంది. కడెం, గూడెం ఎత్తిపోతలు, గొల్లవాగు, ర్యాలీవాగు, ప్రాజెక్టుల కాల్వల కింద ఎక్కువగా వరి సాగు చేస్తున్నారు. దీంతో గోదావరి నది పరీవాహక ప్రాంతంలోనూ సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉంటుంది. భూగర్భజలాలు పెరగడంతో బోరుబావుల సంఖ్య సైతం జిల్లాలో పెరిగింది. జలాశయాలతోపాటు బోరుబావులు ఎక్కువగా ఉండడంతో రైతులు వరిసాగుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఖరీఫ్ వరికోతల అనంతరం రబీ సాగులో రైతులు ఎక్కువగా స్వల్పకాలిక(దొడ్డురకం) వరి వంగడాలకే అధిక ప్రాధాన్యత ఇస్తుండగా ఈ ఏడాది మద్దతు ధరతోపాటు బోనస్ ప్రకటించడంతో సాగు మొత్తం విస్తీర్ణంలో సన్నరకం సాగు 50శాతం ఉండే అవకాశం ఉంది. గత ఏడా ది కంటే ఈ ఏడాది సాధారణ వర్షపాతం నమోదైంది.

రబీ సాగు విస్తీర్ణం అంచనా(ఎకరాల్లో)

పంట	ఎకరాలు
వరి	1,06,693
మొక్కజొన్న	3,709
వేరుశనగ	280
పెసలు	214
జొన్న	244
మినుములు	145
నువ్వులు	90
శనగ	95
ఇతర పంటలు	12,822
మొత్తం	1,24,292
విత్తనాలు అవసరం	34 వేల క్వింటాళ్లు
ఎరువులు	14,200మెట్రిక్‌టన్నులు

'విద్యార్థుల కుటుంబాలను ఆదుకుంటాం'



విద్యార్థుల కుటుంబాలను పరామర్శిస్తున్న ఎంపీ వంశీకృష్ణ

చెన్నూర్‌రూరల్: గోదావరి నదిలో మునిగి మృతిచెందిన విద్యార్థుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. మండలంలోని సుందరసాల గ్రామ సమీపంలో ఉన్న గోదావరి నదిలో మునిగి ఇద్దరు విద్యార్థులు కొండ అరుణ్‌కుమార్, దాసరి సాయి మృతిచెందగా.. వారి కుటుంబాలను శనివారం ఎంపీ వంశీకృష్ణ దుగ్నెపల్లి గ్రామానికి వెళ్లి పరామర్శించారు. కాంగ్రెస్ కార్యకర్త మల్లేష్ తల్లి ఇటీవల మృతిచెందగా కుటుంబాన్ని పరామర్శించారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని వినతి

పాతమంచిర్యాల: బీసీ డిక్లరేషన్ రేషన్ అమలు చేయాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి అక్కల రమేష్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన సమగ్ర కుల గణన కార్యక్రమంపై జరిగిన సమావేశంలో ఎంపీ వంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు.

ముస్లింలకు గ్యారీ పండుగ శుభాకాంక్షలు

మందమర్రిరూరల్: పట్టణంలోని రెండవ జోన్‌లో ఉన్న మజీద్‌ను ఎంపీ గడ్డం వంశీకృష్ణ శనివారం సాయంత్రం సందర్శించారు. ముస్లింలకు గ్యారీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. మజీద్ పెద్దలు ఎంపీని శాలువాతో సత్కరించారు. షాదీఖానా ఏర్పాటు చేయాలని, ఖబ్రస్థాన్‌లో సౌకర్యాలు కల్పించాలని వినతిపత్రం అందజేశారు.

అట్రాసిటీ చట్టంపై అవగాహన ఉండాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, పక్కన డీసీపీ భాస్కర్, అదనపు కలెక్టర్ మోతిలాల్

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజలు పౌరహక్కులు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని, ఆ దిశగా అధికారులు, జిల్లా స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీపై జిల్లా స్థాయి త్రైమాసిక సమావేశంలో జిల్లా అధికారులు, కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అట్రాసిటీ పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని అన్నారు. మంచిర్యాల జిల్లా డీసీపీ భాస్కర్ మాట్లాడుతూ బాధితులకు సత్వర న్యాయం చేసేందుకు విచారణతోపాటు ఎఫ్ఐఆర్ ప్రక్రియ వేగవంతానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, ఆర్డీవోలు శ్రీనివాస్‌రావు, హరికృష్ణ, ఏసీపీలు ప్రకాష్, రవికుమార్, వెంకటేశ్వర్లు, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పోటు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: ధాన్యం కొనుగోలు కేంద్రాలు త్వరగా ప్రారంభించి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం సేకరించాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లు, పౌరసరఫరాలశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ సన్నరకం వడ్లకు ప్రభుత్వం రూ.500 బోనస్ అందిస్తుందని, సన్నరకం, దొడ్డురకం వడ్ల సేకరణకు వేర్వేరుగా కేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన 15రోజుల్లోగా రైతుల ఖాతాలో నగదు జమ చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్, జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, అధికారులు పాల్గొన్నారు.

వంద శాతం అక్షరాస్యత సాధించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: వంద శాతం అక్షరాస్యత సాధన దిశగా కృషి చేయాలని రాష్ట్ర పాఠశాల విద్య సంచాలకులు నర్సింహారెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర వయోజన విద్య ఉషారాణితో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర పాఠశాల విద్య సంచాలకులు మాట్లాడుతూ వంద శాతం అక్షరాస్యత సాధన దిశగా న్యూ ఇండియా లిటరసీ కార్యక్రమం ద్వారా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ మాట్లాడుతూ మొదటి విడతలో జిల్లాలో 20,425 మంది లక్ష్యం కాగా 18,243 మంది నిరక్షరాస్యులను గుర్తించామని, వీరికి విద్య అందించేందుకు 2,043 మంది వాలంటీర్లను నియమించామని తెలిపారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పాచినీళ్ల తోగు వద్ద పులి ప్రత్యక్షం



పులి(ఫైల్)



పులి పాదముద్రలు

వేమనపల్లి: అలజడి లేకుండా ఉన్న జిల్లా అడవుల్లోకి మరో పులి అతిథిగా వచ్చి వెళ్తోంది. రెండ్రోజుల క్రితం కొత్తజాజులపేట సమీపంలోని ఒడ్డుగూడెం అటవీ పరిధి పాచినీళ్ల తోగు వద్దకు పులి వచ్చినట్లు తెలుస్తోంది. స్థానిక ఎఫ్ఎస్ఓ, బేస్‌క్యాంపు సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్లి పులి పాదముద్రలు సేకరించారు. సీసీ కెమెరాల్లోనూ ట్రాక్ అయినా పులి భద్రత దృష్ట్యా బయటకు పొక్కనీయడం లేదు. పాచినీళ్ల తోగు నుంచి పులి మేదరికండి మొండిగుట్ట మీదుగా కుమురంభీం జిల్లా రాంపూర్ అడవుల్లోకి వెళ్లినట్లు అటవీ అధికారులకు సమాచారం ఉంది. ఈ పులి నెలలో కనీసం మూడుసార్లు ఈ ప్రాంతానికి వస్తూ వెళ్తున్నట్లు సమీప గ్రామాల ప్రజలు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అధికారులు ఎప్పటికప్పుడు పులి కదలికలను గమనిస్తూనే ఉన్నారు.

వణికిస్తున్న వైల్డ్ డాగ్

ఒడ్డుగూడెం-వేమనపల్లి అటవీ బీట్‌లో అడవి కుక్కలు(వైల్డ్ డాగ్) పులి రాకను అడ్డుకుంటున్నట్లు అధికారులు, సమీప గ్రామాల ప్రజలు తెలిపారు. వారం రోజుల క్రితం ఖర్జీ, రాంపూర్ గ్రామాల మధ్య ఉన్న అటవీ ప్రాంతంలోని చెరువు సమీపంలో ఎద్దుపై పులి దాడి చేసి చంపింది. మాంసం కుళ్లిన తర్వాత తినడం పులి ఆహారపు అలవాటు. రెండు రోజులకు తిరిగి ఎద్దు కళేబరం వద్దకు వెళ్లగా అక్కడ ఉన్న అడవి కుక్కలు పులిని అడ్డుకున్నట్లు తెలుస్తోంది. పులి అక్కడి నుంచి పాచినీళ్ల తోగు, మేదరికండి వైపు వచ్చినట్లు అధికారులకు సమాచారం ఉంది. పులి ఆవాసమైన నీల్వాయి, కోటపల్లి రేంజ్‌ల వైపు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నా అడవి కుక్కలు అడుగడుగునా అడ్డుకుంటున్నట్లు స్థానికుల సమాచారం. గతంలో సైతం మంచిర్యాల జిల్లా వైపు వచ్చిన పులులకు అడవి కుక్కలతో తలపడలేక వేరే ప్రాంతాలకు మకాం మార్చినట్లు అధికారుల పరిశీలనలో ఉంది. ఈ పులి ఫాల్గుణ సంతతికి చెందిన ఆడపులిగా తెలుస్తోంది. పులి పాదముద్రలు 13 సెంటీమీటర్ల విస్తీర్ణంలో ఉన్నాయి.

అందరి అభిప్రాయాలు స్వీకరిస్తాం

- ఎమ్మెల్యే కే.ప్రేమ్‌సాగర్‌రావు



మార్కెట్ రోడ్డులో వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: తెలంగాణ ప్రభుత్వం సమగ్ర ఇంటింటి సర్వే సందర్భంగా అన్ని కుల సంఘాల అభిప్రాయాలు స్వీకరించి ప్రభుత్వానికి నివేదిస్తామని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. సర్వే సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో శనివారం డీసీసీ అధ్యక్షురాలు కే.సురేఖ ఆధ్వర్యంలో అన్ని కుల సంఘాలు, వివిధ పార్టీల నాయకుల సమావేశం నిర్వహించారు. ప్రేమ్‌సాగర్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే రిజర్వేషన్ల కోసం కాదని, ప్రతీ కుటుంబానికి సంబంధించిన వివరాల సేకరణ వల్ల భవిష్యత్‌లో అన్ని కులాల వారికి సమన్యాయం చేసేందుకు వీలుంటుందని తెలిపారు. పార్టీలకు అతీతంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామని అన్నారు. ఈ సమావేశంలో పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ, మంచిర్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ సల్ల మహేశ్, నస్పూర్ చైర్మన్ సురిమిల్ల వేణు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సేవలు సద్వినియోగం చేసుకోవాలి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. శనివారం స్థానిక ఎంసీహెచ్‌ను ఆయన సందర్శించారు. వార్డులను తనిఖీ చేసి వైద్య సేవలపై గర్భిణులు, బాలింతలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్చంద్రారెడ్డి, ఆర్ఎంవో డాక్టర్ శ్రీమన్నారాయణ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యం

మంచిర్యాలటౌన్: నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. మంచిర్యాల మార్కెట్‌లో రోడ్లను మున్సిపల్ అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫ్లెఓవర్ బ్రిడ్జి నుంచి బెల్లంపల్లి చౌరస్తా వరకు, మున్సిపల్ కార్యాలయం నుంచి మార్కెట్ రోడ్డు, ముఖరం చౌరస్తా, వాటర్ ట్యాంకు రోడ్డు వెడల్పు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్, టీపీఎస్ శ్యాం, మున్సిపల్ వైస్ చైర్మన్ సల్ల మహేశ్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

సేంద్రీయ వ్యవసాయంపై దృష్టి సారించాలి

- కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ శివకృష్ణ



మాట్లాడుతున్న కో ఆర్డినేటర్ శివకృష్ణ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లాలోని రైతులంతా సేంద్రీయ వ్యవసాయంపై దృష్టి సారించాలని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ శివకృష్ణ అన్నారు. శనివారం హాజీపూర్ మండల ఆహార ఉత్పత్తి సంస్థ(ఎఫ్‌పీసీ) ఆధ్వర్యంలో హాజీపూర్‌లోని గోనె శ్యాంసుందర్‌రావు గోశాలలో సేంద్రీయ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ శివకృష్ణ మాట్లాడుతూ రసాయనిక ఎరువులతో భూమి, నీరు, గాలి, పర్యావరణం కలుషితమవుతున్నట్లు తెలిపారు. ఎఫ్‌పీసీ సలహాదారుడు గోనె శ్యాంసుందర్‌రావు మాట్లాడుతూ ప్రతీ రైతు కనీసం ఓ గుంటలో కూరగాయలు సాగు చేసి తమ కుటుంబ అవసరాల కోసం సేంద్రీయ వ్యవసాయం చేస్తూ ఆరోగ్యం కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు తిరుపతి, నాగరాజు, ఎఫ్‌పీసీ డైరెక్టర్లు పూస్కూరి శ్రీనివాసరావు, బొడ్డు శంకర్, బొలిశెట్టి తిరుపతి, సేంద్రీయ రైతులు శ్రీనివాస్, కిషన్, రాచకొండ చందన, బొడ్డు భూమయ్య, అర్జున్, జితేందర్‌రావు, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు

మంచిర్యాలఅగ్రికల్చర్: వినియోగదారులకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రావణ్‌కుమార్ అన్నారు. శనివారం విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయంలో డీఈ, ఏడీఈ, ఏఈలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ విద్యుత్ వినియోగానికి అనుగుణంగా బిల్లులు వసూలయ్యేలా చర్యలు తీసుకోవాలని, ప్రతీరోజు బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. బీపీఎల్ సర్వీస్, వ్యవసాయ రంగ కొత్త కనెక్షన్లు మంజూరైన వెంటనే ఇవ్వాలని, ట్రాన్స్‌ఫార్మర్, రానున్న వేసవిలో సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎస్ఏవో రాజేశం, డీఈ ఫైజర్, ఏడీఈలు వేణుగోపాల్, మోహన్‌రెడ్డి, బాలకృష్ణ పాల్గొన్నారు.



దండేపల్లి సమీపంలో..



జన్నారం ప్రధాన రహదారిపై..

కమ్మేసిన పొగమంచు

దండేపల్లి/జన్నారం: దండేపల్లి, జన్నారం మండలాల్లో శనివారం ఉదయం పొగమంచు కమ్ముకుంది. ఉదయం 8గంటల వరకు దట్టమైన పొగమంచుతో రోడ్ల వెంట వాహనదారులు లైట్లు వేసుకుని వెళ్లారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

క్లుప్తంగా

పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుకున్న బియ్యంతో అధికారులు

ఖానాపూర్: పట్టణంలోని కుమురంభీం చౌరస్తాలో అటవీశాఖ అధికారులు శనివారం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అటుగా ఓ వాహనం వచ్చింది. దానిని ఆపి తనిఖీ చేయగా.. అందులో పీడీఎస్ బియ్యం కనిపించాయి. డ్రైవర్‌తోపాటు మరో వ్యక్తిని బియ్యం ఎక్కడివని ప్రశ్నించారు. వారు పొంతనలేని సమాధానం చెప్పడంతో సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు వెంటనే అక్కడకు చేరుకుని పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే ఇద్దరినీ అదుపులోకి తీసుకుని బియ్యాన్ని సీజ్ చేశారు. నిందితులపై 6ఏ కేసు నమోదు చేసినట్లు సివిల్‌సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ కార్తీక్‌రెడ్డి తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి

సారంగపూర్: మండలంలోని జామ్ గ్రామంలోని దాబా హోటల్‌లో పనిచేసే వంటమనిషి నందుగౌడ్ (40) శనివారం ఉదయం గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతిచెందాడు. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్ర కారం.. గ్రామానికి చెందిన దాబా హోటల్‌లో నందుగౌడ్ వంటమనిషిగా పనిచేస్తున్నాడు. అతని స్వగ్రామం మహారాష్ట్రలోని కిన్వట్ తా లూకా తలారి. యజమాని సూచన మేరకు పాత దాబా నుంచి సమీపంలోని కొత్త దా బాకు కాలినడకన సామగ్రిని తరలిస్తున్న క్ర మంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వె ళ్లిపోయింది. స్థానికులు దాబా యజమాని గణేశ్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే నందుగౌ డ్‌ను నిర్మల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి 108లో తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతిచెందాడు. నందుగౌడ్‌కు భార్య, ముగ్గురు కూతు ళ్లు ఉన్నారు. ఈ ఘటనలపై తమకు ఫిర్యాదు అందలేదని ఏఎస్సై వసంత్ తెలిపారు.

రోడ్డు పనులను అడ్డుకున్న అటవీ అధికారులు



గ్రామస్తులతో మాట్లాడుతున్న అటవీ అధికారులు

ఖానాపూర్: మండలంలోని అడవి సారంగాపూర్ పంచాయతీ పరిధిలోని రాజులమడుగు నుంచి జిల్లెడికుంట వరకు చేపట్టిన మట్టిరోడ్డు పనులను అటవీశాఖ అధికారులు శనివారం అడ్డుకున్నారు. రోడ్డు పనులకు అటవీ అనుమతులు తీసుకోవాలని సత్తన్‌పల్లి ఎఫ్‌బీవో అనుపమ గ్రామస్తులకు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు.. మాడావి అంకుశ్‌రావు, లింగు, మారుతి, మోహన్ తదితరులు మాట్లాడారు. మారుమూల అటవీ ప్రాంతంలోని తమకు ఉన్న పాతరోడ్డు వర్షకాలంలో కొట్టుకుపోయిందని, గుంతలు పడడంతో ఇబ్బంది పడుతున్నామని పేర్కొన్నారు. గతంలోనూ మట్టి రోడ్డు నిర్మించుకున్నామని, అప్పుడు అనుమతులు తీసుకోలేదని తెలిపారు. ఇప్పుడు కొత్తగా అనుమతుల పేరుతో పనులు ఆపడం సరికాదన్నారు. తాము అటవీ భూముల్లో తవ్వకాలు చేయడం లేదని, ఆక్రమణలు చేపట్టడం లేదని తెలిపారు. అనంతరం రోడ్డు పనులు చేపట్టారు. కార్యక్రమంలో సోమర్‌పేట్ ఎఫ్‌బీవో నారాయణ పాల్గొన్నారు.

ప్రోత్సహిస్తే సత్తా చాటుతాం

- రవాణా చార్జీలు కూడా చెల్లించడం లేదు
- అండర్–14 ఖోఖో క్రీడాకారుల ఆవేదన



మండల కేంద్రంలో ఖోఖో ఆడుతున్న బాలికలు

లక్ష్మణచాంద: తమను ప్రోత్సహిస్తే క్రీడా పోటీల్లో సత్తా చాటుతామంటున్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఉమ్మడి జిల్లా ఖోఖో క్రీడాకారులు అంటున్నారు. నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం అండర్–14 బాలికల జోనల్‌స్థాయి జట్టు ఎంపిక పోటీలు శనివారం నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఉమ్మడి జిల్లా పరిధిలోని నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. పోటీల్లో పాల్గొని సత్తా చాటిన 12 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు మరో ఐదుగురు క్రీడాకారులను స్టాండ్‌బైగా ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లా నుంచి మొత్తం 17 మంది బాలికలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు తమ అభిప్రాయాలను సాక్షితో పంచుకున్నారు. లక్ష్మణచాంద ప్రభుత్వ పాఠశాలలో వసతులు భాగున్నాయని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్లడమే ఇబ్బందిగా ఉందని తెలిపారు. ప్రభుత్వం తమకు కనీసం రవాణా చార్జీలు కూడా ఇవ్వడం లేదని తెలిపారు. క్రీడా దుస్తులు, షూస్, రవాణా చార్జీలు అన్నీ తామే భరిస్తున్నామని పేర్కొన్నారు.

వసతులు బాగున్నాయి



లక్ష్మణచాందలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జోనల్ స్థాయి జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఇక్కడ వసతులు బాగున్నాయి. స్థానిక దాతలు క్రీడాకారులకు క్రీడాదుస్తులు పంపిణీ చేయడం సంతోషంగా ఉంది.

– శ్రీనిధి, ఆదిలాబాద్ జిల్లా

చేయూతనివ్వాలి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చాలామంది విద్యార్థులు వివిధ రకాల క్రీడల్లో నైపుణ్యం ఉన్నా ఖర్చులు భరించలేక పోటీలకు దూరమవుతున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులే భరించాల్సి వస్తోంది. ప్రభుత్వం చూయూతనివ్వాలి.

– కృష్ణ, పీడీ, అష్ట ప్రభుత్వ పాఠశాల

సొంత ఖర్చులతోనే పోటీలకు..



ఎక్కడ పోటీలు జరిగినా తమ సొంత డబ్బులతోనే అక్కడకు వెళ్లాల్సి వస్తోంది. ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆటలపై ఉన్న ఇష్టంతోనే ఆర్థిక ఇబ్బందులు ఎదరైనా వెళ్తున్నాం. ప్రభుత్వం కనీసం రవాణా చార్జీలు చెల్లించాలి.

– నాగేశ్వరి, ఆసిఫాబాద్ జిల్లా

దాతలు ముందుకు రావాలి



క్రీడాకారులకు దాతలు అండగా నిలవాలి. రవాణా, క్రీడా దుస్తులు, షూష్, స్పోర్ట్స్ కిట్స్ అందించాలి. దాతలు, ప్రభుత్వ సహకారం ఉంటే.. పోటీల్లో మరింత సత్తా చాటుతాం. పతకాలు సాధిస్తాం.

– అంజలి, నిర్మల్ జిల్లా

క్రీడాదుస్తులు అందజేయాలి



వివిధ ప్రాంతాల్లో ఖోఖో ఆడటానికి వెళ్లే క్రీడాకారులకు అవసరమైన క్రీడా దుస్తులు, షూస్‌తోపాటు ఇతర అవసరాలకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలి. క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలి.

– సరోజ, ఆసిఫాబాద్ జిల్లా

ఖోఖో ఉమ్మడి జిల్లా బాలికల జట్టు ఎంపిక



అండర్–14 ఖోఖో జట్టు బాలికలతో తహసీల్దార్ జానకి

లక్ష్మణచాంద: ఖోఖో ఉమ్మడి జిల్లాస్థాయి బాలికల జట్టు ఎంపిక పోటీలు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం నిర్వహించారు. పోటీలను తహసీల్దార్ జానకీ ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని సూచనలు చేశారు. క్రీడల్లో ఆసక్తి ఉన్న విద్యార్థులను గుర్తించి వారిని ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో నిర్మల్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ రవీందర్‌గౌడ్, సెలక్షన్ కమిటీ సభ్యులు కృష్ణ, రాము రాంజీ, మ ల్లేశ్, ఎంపీడీవో రాధ, నిర్మల్ ఏఎంసీ వైస్ చైర్మన్ ఈ టల శ్రీనివాస్, ఎంఈవో అశోక్‌వర్మ, ప్రధానోపాధ్యాయులు రాజు నాయక్, ఉపాధ్యాయులు అశోక్, శ్రీనివాస్, వీడీసీ సభ్యులు నగేష్, రాంరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అండర్–14 ఉమ్మడి జిల్లా జట్టు..

రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టుకు నిర్మల్ జిల్లా నుంచి పి.అంజలి, శ్రీనిధి, నవీన, కీర్తన, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి నాగేశ్వరి, సరోజ, వైష్ణవి, శ్రీలత, అశ్విని, ఆదిలాబాద్ జిల్లా నుంచి అక్షయ అనూష, మంచిర్యాల జిల్లా నుంచి ఆలియా మహావీన్, స్టాండ్‌బైగా రక్షిత, సోనాలి, శ్రీనిత్య, హర్షిత, గీతాంజలి ఎంపికయ్యారు.

జోనల్‌స్థాయి ఖోఖో ఎంపిక పోటీలు



పోటీలో తలబడుతున్న క్రీడాకారులు

ఆదిలాబాద్: ఎస్జీఎఫ్ అండర్–19 ఖోఖో జోనల్ స్థాయి ఎంపిక పోటీలను జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో శనివారం నిర్వహించారు. పోటీలను తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల(బాలుర) ప్రిన్సిపాల్ అనిల్ కాంబ్లే ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించి, క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలన్నారు. జోనల్ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. ఎంపికై న వారు ఈనెల 7నుంచి 9వరకు సికింద్రాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఇందులో వైస్ ప్రిన్సిపాల్ గోవర్ధన్, పెటా ప్రధాన కార్యదర్శి స్వామి, పీఈటీ ప్రతాప్, మహేశ్, అతుల్ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు



హ్యాండ్‌బాల్ ఆడుతున్న విద్యార్థినులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలో ని గిరిజన ఆదర్శ బాలికల క్రీడా పా ఠశాలలో శనివారం 38వ రాష్ట్రస్థా యి సబ్ జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మాజీ ఎంపీపీ మ ల్లికార్జున్, అసోసియేషన్ రాష్ట్ర సెక్రెటరీ శ్యామల పవన్ కుమార్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌రావు, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడిగొప్పుల సదానందం స్మారకార్థం నిర్వహిస్తున్న పోటీల్లో రాష్ట్రంలోని 10 ఉమ్మడి జిల్లాలకు చెందిన 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. ఇందులో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. మొదటిరోజు జరిగిన పోటీల్లో ఉమ్మడి ఆది లాబాద్ జిల్లా జట్టు నిజామబాద్, ఖమ్మం జట్లపై విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో మీనారెడ్డి, హ్యాండ్‌బాల్ రాష్ట్ర రెఫరీ బోర్డు కన్వీనర్ ఇంద్ర సేనారెడ్డి, కోచ్‌లు అరవింద్, విద్యాసాగర్, తిరుమల్, పాల్గొన్నారు.

బాలుడి అనుమానాస్పద మృతి



లాల్‌షావ్ మృతదేహం



లాల్‌షావ్ (ఫైల్)

ఇంద్రవెల్లి: మండలంలోని దస్నాపూర్ పంచాయతీ పరిధి అనంతపూర్ గ్రామంలో బాలుడు అనుమానాస్పద స్థితిలో బావిలో పడి శనివారం మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తొడసం నాగోరావ్–ఇస్రుబాయి దంపతుల చిన్న కుమారుడు లాల్‌షావ్(11) మండలంలోని వడగామ్ ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం సాయంత్రం చేనులో ఉన్న ఎడ్లను తీసుకు రావాలని తండ్రి చెప్పడంతో అక్కడికి వెళ్లిన లాల్‌షావ్ రాత్రి అయినా ఇంటికి తిరిగి రాలేదు. సమీప చేలతోపాటు అటవీ ప్రాంతంలో గాలించినా ఆచూకీ లభించలేదు. శనివారం ఉదయం సమీప బావిలో స్థానికులు మృతదేహాన్ని గుర్తించారు. ఎస్సై సునీల్ ఘటనా స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యుల ద్వారా వివరాలు తెలుసుకున్నారు. తన కుమారుడికి ఈత వస్తుందని, మృతిపై అనుమానం ఉందని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంత రం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు.

కోడిపందేల స్థావరాలపై దాడులు

కోటపల్లి: మండలంలోని సుపాక గ్రామ శివారు ప్రాణహిత నది వద్ద కోడిపందేల స్థావరాలపై దాడి చేసి 11మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. మూడు కోడిపుంజులు, 9 సెల్‌ఫోన్లు, రూ.16810 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కోడిపందేలు, పేకాటపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భర్త వేధింపులు భరించలేక ఆత్మహత్య



మృతురాలు భారతీభాయి

కుభీర్: మండలంలోని న్యూసాంవ్లి గ్రామానికి చెందిన కొత్తిమీర భారతీబాయి(32) భర్త, మరిది వేధింపులు భరించలేక శనివారం ఉదయం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. భారతీబాయికి నూసాంవ్లి గ్రామానికి చెందిన దయానంద్‌తో 14 ఏళ్ల క్రితం పెళ్లయింది. వీరికి 12 ఏళ్లలోపు ఇద్దరు కుతుళ్లు ఉన్నారు. దంపతులిద్దరూ వ్యవసాయ కూలీలుగా పనిచేస్తూ పిల్లలను పోషిస్తున్నారు. ఇటీవల మద్యానికి బానిసైన దయానంద్ పని మానేసి నిత్యం తాగొచ్చి గొడవ పడుతున్నాడు. దయానంద్ తమ్ముడు కూడా అన్నకు వత్తాసు పలికేవాడు. దీంతో మనస్తాపం చెందిన భారతీబాయి.. శనివారం ఉదయం ఇంట్లో చీరతో ఉరేసకుంది. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై రవీందర్ ఘటన స్థలికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టంక తరలించారు. భారతీబాయి సోదరుడు సాంగే ప్రకాశ్ ఫిర్యాదు మేరకు భర్త దయానంద్, మరిది కీర్తి రతన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భార్య, అత్తింటివారు వేధిస్తున్నారని...

లక్ష్మణచాంద: భార్య, అత్తింటివారి వేధింపులు భరించలేక ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని తిర్పెల్లిలో జరిగింది. ఎస్సై సుమలత తెలిపిన వివరాల ప్రకారం.. ఖానాపూర్ మండలం ఇక్బాల్‌పూర్‌కు చెందిన పల్లపు పెద్దులు(35)కు తిర్పెల్లి గ్రామానికి చెందిన గంగజమునతో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కొన్నేళ్లుగా పెద్దలు తిర్పెల్లి గ్రామంలోనే భార్య, పిల్లలతో ఉంటున్నాడు. వ్యవసాయ కూలీగా పనిచేస్తూ భార్య, పిల్లలను పోషించుకుంటున్నాడు. అయితే కొన్ని రోజులుగా భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో అత్తింటి వారు కూడా జోక్యం చేసుకున్నారు. పెద్దులును బెదిరించారు. శుక్రవారం కూడా గొడవ జరగడంతో మనస్తాపం చెందిన పెద్దులు శుక్రవారం ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. దీంతో గంగజమున పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్నారు. శనివారం తెల్లవారుజామున గ్రామ శివారులో ఓ చెట్టుకు పెద్దులు ఉరేసుకుని కనిపించాడు. దీంతో గ్రామస్తులు కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన స్థలికి చేరుకుని పరిశీలించారు. మృతదేహం వద్ద సూసైడ్ నోట్ లభించింది. అందులో భర్త, అత్తింటివారి వేధింపులతో ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నాడు. దీంతో పోలీసులు ఈ సూసైడ్ నోట్, పెద్దులు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఆత్మహత్యకు కారకులైనవారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

భార్య మందలించిందని..



నాగోరావ్ (ఫైల్)

తానూరు: భార్య మందలించిందని మండలంలోని బోల్సా గ్రామానికి చెందిన గాడేకర్ నాగోరావ్(50) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగోరావ్ కొద్దిరోజులుగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం తాగవద్దని భార్య వందన తరచూ మందలిస్తోంది. గురువారం తాగొచ్చిన భర్తను మందలించింది. దీపావళి పండగ నేపథ్యంలో కుభీర్ మండలం బెల్‌గాంలోని పుట్టింటికి వెళ్లింది. అదే రోజు రాత్రి నాగోరావ్ ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. శనివారం భార్య వందన నాగోరావ్‌కు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. దీంతో పక్కింటి వారికి ఫోన్ చేసి భర్తను పిలవాలని కోరింది. వారు వెళ్లి చూడగా నాగోరావ్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. విషయం భార్యకు చెప్పి.. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘనట స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు. వందన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. నాగోరావ్‌కు ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



తిరుపతి(ఫైల్)

కాసిపేట: మండలంలోని దేవాపూర్‌లో శనివారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో చేదం తిరుపతి(26) మృతిచెందాడు. దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు కథనం ప్రకారం.. దేవాపూర్ నాయకపుగూడకు చెందిన తిరుపతి మోటార్‌సైకిల్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. తెల్లవారు జామున సమీపంలోని చింతగూడ నుంచి దేవాపూర్‌లోని తన ఇంటికి మోటార్‌సైకిల్‌పై వస్తూ లారీ యార్డు వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ప్రమాదవశాత్తు ఢీకొట్టాడు. దీంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లి చేదం రాజక్క ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. కాగా, మృతుడి తండ్రి చిన్నయ్య, సోదరులు వెంకటేష్, ఆంజనేయులు గతంలో అనారోగ్యంతో మృతిచెందారు. ఉన్న ఒక్క కొడుకూ రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో తల్లి ఒంటరైంది.

ఏటీఎం చోరీకి విఫలయత్నం

- 100కు సమాచారం అందించిన మేనేజర్
- రెడ్ హ్యాండెడ్‌గా దొంగను పట్టుకున్న పోలీసులు



నిందితుడిని పట్టుకున్న పోలీసులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని డాక్టర్స్‌లేన్‌లో ఉన్న కెనరా బ్యాంక్ ఏటీఎంలో ఓ వ్యక్తి చోరీకి విఫలయత్నం చేశాడు. పట్టణ పోలీసులు రెండ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. శుక్రవారం అర్ధరాత్రి బ్యాంక్ ఏటీఎంలో ఓ వ్యక్తి వచ్చాడు. అదే సమయంలో బ్యాంకు మేనేజర్ తన బ్యాంకు, ఏటీఎం సీసీ కెమెరాలను సెల్‌ఫోన్‌లో తనిఖీ చేస్తున్నాడు. ఈ క్రమంలో ఏటీఎంకు వచ్చిన వ్యక్తి డబ్బులు తీసుకోకుండా ఏటీఎంను పగుల గొట్టేందుకు యత్నిస్తున్నట్లు గుర్తించాడు. వెంటనే డయల్ 100 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. వెంటనే పెట్రోలింగ్ డ్యూటీలో ఉన్న ఇన్‌స్పెక్టర్ ప్రేమ్‌కుమార్ అక్కడికి చేరుకున్నారు. పోలీసుల రాకను గమనించిన వ్యక్తి అక్కడి నుంచి పారిపోయాడు. ఇన్‌స్పెక్టర్ అక్కడ ఉన్న సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో గాలించగా.. దొంగ దొరికాడు. అతడిని వెల్మల్ బొప్పారం గ్రామానికి చెందిన కుంచం గంగాధర్‌గా గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకున్నారు. దొంగతనాన్ని అడ్డుకున్న ఇన్‌స్పెక్టర్‌ను ఎస్పీ జానకీ షర్మిల అభినందించారు.

తనిఖీల్లో వాహనాలు సీజ్




వాహనాల తనిఖీలు చేపడుతున్న రవాణా శాఖా అధికారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లా రవాణా శాఖా ఆధ్వర్యంలో శనివారం మంచిర్యాల జిల్లా శివారు ప్రాంతాలతోపాటు శ్రీరాంపూర్, ఇందారం, ఓపెన్ కాస్ట్ గనుల పరిసర ప్రాంతాల్లో భారీ, మధ్య తరహా వాహనాలను విస్తృతంగా తనిఖీ చేశారు. ఇంచార్జీ డీటీఓ రంజిత్‌రెడ్డి, ఎంవీఐ కిషోర్‌చంద్రారెడ్డి ఆధ్వర్యంలో దాదాపు 30 భారీ, మధ్య తరహా వాహనాలను తనిఖీ చేశారు. ఆరు భారీ వాహనాలు టాక్స్‌లు చెల్లించకుండా తిరుగుతుండగా, మరికొన్ని వాహనాలు ఫిట్‌నెస్, ఓవర్ లోడ్, తదితర కారణాలతో రోడ్లపై తిరుగుతున్నాయని గుర్తించి సీజ్ చేసి, జరిమానా విధించారు. జరిమానాల రూపంలో రవాణా శాఖకు రూ.3లక్షల వరకు ఆదాయం సమకూరినట్లు తెలిపారు.

నకిలీ మొక్కజొన్న విత్తనాలు పట్టివేత

- పోలీస్ స్టేషన్‌లో ఏఈవో ఫిర్యాదు
- నిందితుడికి రిమాండ్



నకిలీ మొక్క జొన్న విత్తనాలతో చందుల మహేశ్(టక్ వేసుకున్న వ్యక్తి)

నర్సాపూర్(జి): మండలంలోని అర్లి(కె) ఎక్స్ రోడ్డు వద్ద ద్విచక్ర వాహనంపై తరలిస్తునర్న నకిలీ మొక్కజొన్న విత్తనాలను ఏఈవో గణేశ్ పట్టుకున్నారు. కుభీర్ మండలం చాత గ్రామానికి చెందిన చందుల మహేశ్ శనివారం ద్విచక్రవాహనంపై మూడు సంచుల్లో పయనీర్ మొక్కజొన్న హైబ్రిడ్–పీ 3546 నంబరు గల 30 విత్తనాల ప్యాకెట్లను తరలిస్తున్నట్లు ఏఈవోకు సమాచారం అందింది. దీంతో తనిఖీ చేయగా విత్తనాలకు సంబంధించిన ఎలాంటి రశీదులు చూపలేదు. పయనీర్ కంపెనీ వ్యక్తి వచ్చి క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగా వివరాలు రాలేదు. దీంతో నకిలీ విత్తనాలుగా నిర్ధారించారు. ఒక్కో సంచిలో 10 విత్తన ప్యాకెట్ల చొప్పున మూడు సంచుల్లో 30 ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించారు. ఒక్కో ప్యాకెట్ 4 కేజీల బరువు, ధర రూ.2,392 ఉందని తెలిపారు. విత్తనాల విలువ రూ.71,760 వరకు ఉంటుందని తెలిపారు. నకిలీ విత్తనాలను రైతులకు అధిక లాభాలకు అమ్మి మోసం చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఏఈవో గణేశ్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించామని ఎస్సై హన్మాండ్లు తెలిపారు.

చదువుల తల్లిని ఆదుకోండి

- నీట్‌లో జాతీయ స్థాయి ర్యాంకు
- గిరిజన విద్యార్థినికి ఆర్థిక కష్టాలు



శిరీష

నెన్నెల: చదువుల తల్లిని ఆర్థిక కష్టాలు వెంటాడుతున్నాయి. నీట్‌లో జాతీయ స్థాయి ర్యాంకు సాధించినా బుక్స్, హాస్టల్ ఫీజుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కూలీ పనులు చేసి రెక్కల కష్టంపై ఎలాగోలా తల్లిదండ్రులు ప్రభుత్వ గిరిజన విద్యాలయంలో ఆమెను చదివించారు. ఆమెలోని ప్రతిభతో డాక్టర్ కావాలన్న దిశగా పయనిస్తోంది. కానీ ఆర్థిక స్థితిగతులు ముందడుగు వేయనివ్వడం లేదు. డాక్టర్ చదువు కోసం కనీసం ఫీజు కూడా కట్టలేని స్థితిలో ఆ కుటుంబం ఉంది. కన్నెపల్లి మండలం రెబ్బెన గ్రామానికి చెందిన మానేపల్లి పెంటయ్య, లక్ష్మి అనే గిరిజన నిరుపేద దంపతుల కూతురు శిరీషకు డాక్టర్ కావాలన్న కోరిక. నీట్‌లో జాతీయ స్థాయి ర్యాంకు సాధించి భూపాలపల్లి ప్రభుత్వ వైద్య కాలేజీలో దాతల సాయంతో అడ్మిషన్ తీసుకుంది. బుక్స్, హాస్టల్ ఫీజు కట్టలేక ఇబ్బంది పడుతోంది. దాతల సాయం కోసం ఎదురుచూస్తోంది. దాతలు ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని వేడుకుంటోంది. విద్యార్థినికి సాయం చేయాలనుకునే వారు 9392673867 నంబర్‌కు ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా ఆర్థిక సాయం అందించగలరు.

ఏక్ పోలీస్ వ్యవస్థ అమలు చేయాలి



నినాదాలు చేస్తున్న గణేశ్, ఇతర నాయకులు

- తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేశ్

ఆదిలాబాద్‌రూరల్: రాష్ట్రంలో ఏక్ పోలీస్ వ్యవస్థను అమలు చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేశ్ డిమాండ్ చేశారు. మావల మండలం కుమురంభీం గూడలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏక్ పోలీస్ వ్యవస్థను అమలు చేయాలని కొద్ది రోజులుగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని బెటాలియన్లలోని పోలీసులు కోరుతున్నారన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. పోలీసుల న్యాయమైన పోరాటానికి తడుందెబ్బ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుక, ఉపాధ్యక్షురాలు ఉయిక ఇందిరా, ఆదిలాబాద్ డివిజన్ అధ్యక్షుడు ఆత్రం గణపతి, నాయకులు ప్రకాశ్, అనుసూయ తదితరులు పాల్గొన్నారు.